# పట్టామీది నాణెం

## జగన్నాథ శర్మ

**ఇక్కడే నన్ను నేను పోగొట్టుకున్నది. పదిహేనేళ్ళ క్రితం నా బాల్యాన్ని నేనిక్కడే పారేసుకున్నాను. శిఖరాగ్రమ్మీద నిలిచి, గోళీని జారవిడుచుకున్నదిక్కడే! పొదల మాటుకి పారిపోయిందది! దొరుకుతుందన్న ఆశ లేదు. దొరకబుచ్చుకోవాలని ప్రయత్నిస్తున్నాను.**

తెలతెలవారుతోంది. చలిచలిగా వుంది. వాచీకేసి చూశాను. అయిదున్నర కావస్తోంది. ఇంకా మంచు వీడలేదు. తెరలు తెరలుగా వేలాడుతోంది.

ఇక్కణ్ణుంచి ట్రయిన్‌లో టౌన్ స్టేషన్‌కి, అయిదంటే అయిదు నిమిషాలు ప్రయాణం. ఆ సమయాన్ని కూడా భరించలేకున్నాను. రైలు దిగి నడచి పోదామని వుంది.

"ఏ స్టేషన్ సార్" బెర్తు మీది ప్రయాణికుడు నిద్ర గొంతును సవరించుకున్నాడు.

"పార్వతీపురం" అన్నాను.

కూతవేసి రైలు కదిలింది.

వెలుతురుకి దీపాలు వాడిపోతున్నాయి. అంతటా తడితడిగా వుంది. కిటికీలో నుంచి దూసుకొస్తూ, నా నేల మీది గాలి, ఊరి హృదయంలా నన్ను హోరు హోరున పలకరిస్తోంది. ముడుచుక్కూర్చోలేదు. బోరవిరుచుకున్నాను.

రానున్న స్టేషన్లో దిగేందుకు ఎవరో భార్యా భర్తలు లగేజీనంతా డోర్‌కి దగ్గరగా చేరవేస్తున్నారు. వాళ్ళదీ నేల కాదని తెలుస్తోంది. ఆ కళ్ళల్లో వెలుగు గువ్వలు పొరాడ్డం లేదు.

"చలి విపరీతంగా వుంది" అందామె.

"కొండ ప్రాంతం మరి" అన్నాడతను.

టౌన్ స్టేషన్ గేటు వచ్చేసింది.

రైలు నెమ్మదయింది . గేటుకి అటు ఇటుగా ఓ బస్సు, రెండు లారీలు, మూణ్నాలుగు ఎడ్లబళ్ళు నిలిచి వున్నాయి. ప్లాట్‌ఫారమ్మీదికొచ్చింది రైలు. హడావుడిగా లేచి నిల్చున్నాను.

తురాయి చెట్లు, కొమ్మల చేతులూపుతున్నాయి. సిమెంటు బెంచీలు పెదవులు నొక్కి పెట్టి నవ్వుతున్నాయి. దీప స్తంభాలు కళ్ళార్పుతున్నాయి—నన్ను ఆహ్వానిస్తున్నాయి.

రైలు నిలిచింది. ఫుట్ బోర్డు మీది పాదాన్ని నేలన ఆన్చానో లేదో దేహమంతా సంచలించి పోయింది.

ఆ భార్యా భర్తలు, నేను, మాతో పాటు మరి ఆరేడుగురు దిగారు. వాళ్ళంతా స్టేషన్ విడిచి వెళ్ళిపోయారు. నేను మాత్రం నిలిచి వున్న చోటునే వున్నాను.

జామ, మందారం, అరటి చెట్లతో పచ్చ పచ్చగా ధూళి ధూళిగా వున్న గేట్‌మన్ క్వార్టర్ కన్పించింది. ఆ చెట్లలోంచి పొగ దట్టంగా పైకెగసి వస్తోంది. రాక్షస బొగ్గు రాజుకున్నట్టుంది. దాని వాసన ముక్కుకి సోకింది. అక్కణ్ణుంచి అస్పష్టంగా మాటలు వినవస్తున్నాయి.

పన్నెండేళ్ళ వాణ్ణి అయిపోయాన్నేను. అమ్మ ముగ్గు బెడుతోంది. కాకులు అరుస్తున్నాయి. ఇంట్లోంచి పారిపోతున్నాన్నేను.

"ఇంత చలిలో ఎక్కడికిరా" అని అమ్మ అరుస్తోంది. విన్పించుకోలేదు. వేగంగా పరుగెడుతున్నాను.

ఈపాటికి పాసింజరు బండి వచ్చి వెళ్ళిపోయుంటుంది. రత్నంగాడు నా కోసం ఎదురు చూస్తుంటాడు. ఎదురొచ్చిన రిక్షాను ఢీకొని పరుగు దీస్తున్నాను. దూరం నుండి చూశాను. రైలు గేటు వేసి లేదు. అంటే? రైలొచ్చి వెళ్ళిపోయిందన్నమాట!

పరుగు పరుగున రత్నం గాడింటికి చేరాను. వాళ్ళమ్మ జామచెట్టు మొదలులో సిగిడీని రాజేస్తూ కన్పించింది. రాక్షస బొగ్గును రాయి పెట్టి కొడుతోంది.

"బండొచ్చేసిందా" అడిగానామెను.

"ఏది? 92 డౌనా" అడిగిందామె.

"కాదు. పగటి పాసింజరు" అన్నాను.

"అదే! ఇంకా రాలేదు. అరగంట లేటు" అందామె.

"రత్నం గాడేడి" అడిగాను.

"ఇంకా మొద్దు నిద్ర పోతున్నాడు" అందామె. ఊపిరి పీల్చుకున్నాను. వెళ్ళి రత్నంగాడిని లేపాను.

"బండొచ్చిందా" అడిగాడు వాడు.

"లేదు! అరగంట లేటట" అన్నాను.

"అయితే చాలా టైముంది" అన్నాడు రత్నం. దుప్పటిని నిండుగా కప్పుకుని కూర్చునే కునుకు తీస్తున్నాడు.

రత్నంగాడి అక్క. ఆ మూలగా పడుకుని వుంది. గోనె సంచిని కప్పుకుని వుంది. ఆమె శరీరమంతా సంచిలో ఇమడక, పాదాలు రెండూ నల్లగా బయట పడి వున్నాయి. పాతకాలంనాటి పట్టీలు మరింత నల్లగా వాటిని పట్టుకుని వేలాడుతున్నాయి.

"ఇంకా లేవలేదా" వాళ్ళమ్మ అరుస్తూ వచ్చింది. కూతురు పూర్ణ మీద కోపగించుకుంది.

"లే దరిద్రపు ముండా" అంది. పూర్ణ మీది గోనె కప్పును లాగేసింది. బిగిసిన జాకెట్టులో మోకాళ్ళ వరకూ వున్న లంగాలో ముడుచుకు పోయింది పూర్ణ.

"నిన్నే" అంది వాళ్ళమ్మ. పూర్ణ జబ్బ చరిచింది. లాగి కూర్చోబెట్టింది.

"అప్పారావు టీ కొట్టుకి ఇంకా వెళ్ళవా" గదమాయించింది. గుమ్మంలోనికి తోడ్చుకుని వెళ్ళి, పూర్ణ ముఖమ్మీద దోసిలితో చన్నీళ్ళు గుమ్మరించింది.

"ఉండుండవే" అని పూర్ణ బ్రతిమలాడుతున్నా పట్టించుకోలేదామె. క్రరి చేసంచిలో బొగ్గు నుంచి తరిమింది.

సంచిడు బొగ్గుకి అప్పారావు రూపాయి ఇస్తాడు. ఆ రూపాయి కోసం చలిలో చీకట్లో వర్షంలో పూర్ణ పరుగు దీయక తప్పదు.

"వేగంగా రా! మళ్ళీ బండొచ్చేస్తుంది" వాళ్ళమ్మ కేకేసింది.

దుప్పటిని తొలగించి, రత్నంగాడు లేచి కూర్చున్నాడు. వళ్ళు విరుచుకున్నాడు. చలిని ఎదుర్కొనేందుకు సన్నద్ధమయ్యాడు. చేతులు రెండూ వెనక్కి బిగించి మడిచి నడిచాడు. వాణ్ణే అనుసరించాన్నేను.

జామ రెమ్మ నొకదాన్ని విరిచి, దానికి వున్న ఆకుల్ని తొలగించాడు రత్నం. పల్లుంపుల్ల చేసి నాకందించాడు. చల్లగా వుందది. నోట నుంచి నమలసాగాను. రసం కసకసగా వుంది. వాడూ ఓ పుల్ల నోటిలో నుంచుకుని ప్లాట్‌ఫారమ్మీదకి ఉరికాడు.

ప్లాట్‌ఫారానికి ఆ చివర ఏదో భగభగ మండుతోంది.

"కొరివి దయ్యం" అని వణికాన్నేను. నవ్వాడు రత్నం.

"కొరివి దయ్యం కాదు, కుంటి గోపాలం కిళ్ళీ బడ్డీ" అన్నాడు.

పాసింజరు బండి పార్వతీపురం చేరుకుంది. పట్టాల మధ్యకు వచ్చి చూశాం. హెడ్ లైట్ పట్టాల మీద పాకుతోంది.

తెలవారుతోంది. చీకటిని వదలి, చెట్టు పుట్టా వెలుగులో తారాడుతున్నాయి.

"ఈ రోజు తప్పదు! గ్యారంటీ" అన్నాడు రత్నం.

"తప్పదా" రెట్టించాను.

"తప్పదు! రాత్రి నూరుసార్లు రామజపం చేశాను. కోరుకున్న దవుతుంది" అన్నాడు రత్నం.

గంట గణగణ మంది. బండి పార్వతీపురంలో అవుటయింది. టౌన్ స్టేషన్‌కి వస్తోంది. దాని శబ్దం తోలు తిత్తిని వొత్తుతున్నట్టుగా వుంది

ఇద్దరమూ గొంతికిలా కూర్చున్నాం. జామ పుల్లతో పళ్ళను తోముతున్నాం. పూర్ణ మా దగ్గరకి వచ్చింది. రెండు చేతుల్లో రెండు ఖాళీ చేసంచుల్ని పట్టుకుని నిలిచింది.



"సుబ్బారావు మా . మయ్యేనా లైనుకొచ్చేది" రత్నం గాడిని అడిగింది.

"నాకేం తెలుసు" అన్నాడు వాడు.

పాసింజరు డ్రైవరుగా సుబ్బారావు మామయ్య వస్తుంటాడు. పూర్ణంటె అతను పడి చస్తాడు.

ఇంతింతగా ప్లాట్‌ఫారాన్ని తినేస్తూ 'పార్వతీపురం టౌన్' అని రాసి వున్న ఆ చివరి బోర్డు దగ్గరగా వెళ్ళి రైలాగింది. ఇంజన్‌తో పాటుగా పూర్ణ పరుగుదీసింది. అందులో సుబ్బారావు మామయ్యే డ్రైవరుగా వున్నాడు. మకిలి బట్టల్లో మసి బొమ్మలా వుండి, పూర్ణని చూసి చేతిని వూపాడతను. ప్రయాణీకులు పెద్దగా లేరు. ఎక్కేవాళ్ళు, దిగేవాళ్ళంతా కలిసి పదిమంది వుంటారు.

నేను, రత్నంగాడు కూడా పరుగులాంటి నడకతో ఇంజన్ దగ్గరకి చేరాం. సుబ్బారావు మామయ్య పూర్ణ తలమీద ముందుగా మొట్టాడు. తర్వాత దాని జబ్బను గిచ్చి వదిలాడు. ఆ తర్వాత దానిని దగ్గరగా తీసుకుని గుండెలకదుముకున్నాడు.

ఇంజన్ దగ్గర వెచ్చగా వుంది. లోపలి ఫైర్ బాక్స్‌లోని మంట గుట్టలు గుట్టలుగా శవాలు కాల్తున్నట్టుగా వుంది.

పెద్ద పెద్ద బొగ్గు దిమ్మల్ని పూర్ణ దోసంచుల్లో కూరాడు సుబ్బారావు మామయ్య. ముచ్చటపడి ఆ మసి చేతుల్ని పూర్ణ ముఖాన రాశాడు.

''ఫీ ఫో'' అని పూర్ణ అంటుంటే విజృంభించి హోళీకేళి జరిపాడు.

నాకంతా సరదాగా వుంది. నాకులాగే ఇంజన్‌లో గల ఫైర్‌మెన్లిద్దరు కూడా సరదాపడుతున్నారు.

సుబ్బారావు చేష్టల్ని, పూర్ణనీ చూస్తూ నవ్వుతున్నారు.

అయితే రత్నంగాడు నవ్వడంలేదు. ఎందుకో కోపంగా వున్నాడు.

సిగ్నల్ ఇచ్చారు. రైలు బయల్దేరింది.

వెను తిరిగిన పూర్ణ వీపున చిన్ని బొగ్గుకటి వచ్చి విసురుగా తగిలింది.

బాధ కలిగిందేమో! ''లంజ కొడకా'' అని తిట్టిందది.

చక్రాల మోతలో సుబ్బారావు మామయ్యకి ఆ మాట వినిపించి వుండదు. నవ్వుతూ వెళ్ళిపోయాడతను.

అంత పెద్ద రైలూ ఆట బొమ్మలా కనిపించి కనుమరుగయింది. దాని శబ్దం కూడా వచ్చిపోయింది. ఆకాశంలో పొగ దారుల జాడలు లేవు. రైలొచ్చి వెళ్ళిన వాతావరణం మాయమయింది.

కాస్సేపు అలాగే నిల్చుమండి, రత్నంగాడు సైగచేస్తే, వాడితోపాటు రైలు రోడ్డు మీదికి నడిచాను. పరిశీలనగా కిందికి చూస్తూ పట్టాలవెంటి ప్రయాణించసాగాను. అటు పట్టాపై రత్నంగాడు, ఇటు పట్టాపై నేనూ ఆశగా ఆత్రంగా వున్నాం.

ఆర్.పి.ఎఫ్. తనిఖీవల్ల ప్లాట్‌ఫారమ్మీద బొగ్గు నివ్వడం క్షేమం కాదని చెప్పి, రైలు బయల్దేరిన తర్వాత స్టేషన్‌కి కొద్ది దూరంలో మున్న పొలాల్లో బొగ్గును జారవిడుస్తానని సుబ్బారావు మామయ్య అప్పుడెప్పుడో ఓసారి చెబితే రత్నంగాడు, పూర్ణా పొలాల్లోకి పరుగుదీశారట! బొగ్గు సంగతలా వుంచితే పరుగుదీస్తోన్న రత్నంగాడికి పట్టాల నడుమ ఓ ఆకు చెప్పు దొరికిందట! రెండో చెప్పు కోసం మరికొంచెం ముందుకు వెళ్ళాట్ట. ఆశించినట్టుగా ఆ చెప్పు కూడా దొరికిందట! మరోసారి అలాగే ఓ పది పైసల నాణెం, ఇంకో సారి విరిగిన కళ్ళద్దాలూ దొరికాయట! వాటి నుంచి పట్టాల వెంటే అదృష్టం వుంటుందన్నది రత్నంగాడి ఆలోచనయింది. వాటిని నాతో పంచుకుని, కలిసి తిరుగుదామన్నాడు. దొరికిన కాడికి సమానంగా వాటాలు వేసుకుందామని ఊసిగొల్పాడు.

రైలు వచ్చి వెళ్ళిన తర్వాత ఇద్దరమూ పట్టాలతో పోటీపడి పరుగు లంకించుకోవడం దినచర్యయింది.

ఓసారి అగ్గిపెట్టె దొరికింది.

అందులో రూపాయిన్నర చిల్లర వుంది. దాంతో ఆ సాయంత్రం సినిమా చూశాం.

మరోసారి ఓ ఆట బొమ్మ దొరికింది.

తనకి పెద్దని అచ్చంగా నాకిచ్చేశాడు రత్నంగాడు.

ఇంకోసారి ఓ స్టీలు గ్లాసు దొరికితే నాకొద్దని దానిని రత్నం గాడికి నేనిచ్చేశాను.



...కో ఒకటి దొరికి తీరాలన్న పట్టుదలతో నేమా, రత్నంగాడూ పది, పదిహేను కిలోమీటర్ల వరకూ పరుగెత్తడాన్ని అలవాటు చేసుకున్నాం.

ఎవరో పట్టాల నడుమ మల విసర్జన చేశారు. బోర్లించిన శంఖాకారంలో వుందది. దానిని చూసి ఆగిపోయాడు రత్నంగాడు. మోకాళ్ళ మీద చేతులుంచుకుని వంగి దానిని తీక్షణంగా చూడసాగాడు. ముక్కు మూసుకుని వాడి ప్రక్కగా నిల్చున్నాను.

"బండి హాల్ట్ అయినప్పుడే పిల్లలు దొడ్డికి పోతారు. ఆడుకుంటోన్న వస్తువునో, అమ్మానాన్నలిచ్చిన డబ్బుల్నో చేతిలో ఉంచుకుని పాపం ఆటలాడుతూ వాటిని జారవిడుచుకుంటారు. గొట్టంలో నుంచి కిందికి పడి పోతాయవి. వాటి మీద ఇది" అని నవ్వి, ఆశను కనబరిచాడు రత్నంగాడు. ఆలస్యం చేయక రాయిని తీసుకుని కుప్ప మీదికి బలంగా విసిరాడు. చెదిరిందది. అయితే అందులో ఏమీ కనిపించలేదు.

మా ఊళ్ళో బంగార్రాజు పెద్ద షావుకారు. ఆయన పగటి పాసింజరు బండికి ప్రక్క ఊరికి వెళ్ళి, రాత్రి పాసింజరు బండికి తిరిగి వస్తుంటాడు. పొట్టిగా, లావుగా, నీళ్ళ కాగులా వుంటాడాయన. ఉల్లిపొర బట్టలు ధరిస్తాడు. ఆయన లాల్చీ జేబులో నుంచి అయిదులు, పదుల నోట్లు కన్పిస్తూ అందర్నీ ఊరిస్తాయి. ఆయన ఎప్పుడో ఓసారి-కాదు, ఏ రోజు కారోజు-రైలులో నుంచి పడి చనిపోడా? అన్నది రత్నంగాడి ఆలోచన. స్టేషన్‌కి దూరంగా, పొలాల మధ్య బంగార్రాజు శవం దిక్కులేక పడి వుంటుందన్నది మా ఆశ! ఆ శవాన్ని మేమే ముందుగా చూసి, ఆ లాల్చీ జేబులోని డబ్బుల్ని మేమే స్వంతం చేసుకుంటామని పదే పదే భ్రమలు పోతాం.

బంగార్రాజే కానక్కర్లేదు! బంగార్రాజులాంటి షావుకార్లు మా ఊళ్ళో అనేకులు వున్నారు. వాళ్ళలో ఎవరయినా, ఏ రోజయినా ప్రమాదవశాత్తూ మరణించగలరని ఊహిస్తాం! అందుకోసమే ఆత్రం! అందుకోసమే రామ జపం.

కొండల వెనుక సూర్యుడు నలుసు పడిన కన్నులా ఎర్రగా వున్నాడు. రెప్ప మాటున గుడ్డు విల విల్లాడుతున్నట్టుగా, దట్టమయిన మేఘాల మధ్య నుంచి తొంగి చూస్తున్నాడు. ఎండ బంగారంలా వర్షిస్తోంది. రత్నంగాడు అలసిపొయ్యాడు. ఆయాస పడుతున్నాడు. నడవక నిల్చున్నాడు. అందిన మేరకు చూపును సారించి విసుగు చెందాడు. "దీనమ్మా" అన్నాడు. పట్టాను కాలితో తన్నాడు. ఖాళీ సిగరెట్ పెట్టె కూడా దొరకలేదు. కసిగా ఉంది వాడికి. ప్రక్కగా వున్న సిగ్నల్ పోల్ దగ్గరగా నడిచి

"ఇదెక్కి చూస్తాను! శవం ఏదయినా కన్పిస్తే కన్పిస్తుంది. లేక పోతే లేదు. ఇవాల్టికిక చాలు! తిరిగి పోదాం" అన్నాడు. పరేనన్నట్టు తలూపాన్నేను. వాడు పోల్ నానుకుని వున్న నిచ్చెన నెక్కాడు. మెట్టు మెట్టుకీ నిలిచి చూడసాగాడు. పైకి, పైపైకి చేరుకున్నాడు. చిటారు కొమ్మమీది కోతిలా వేలాడాడు. ఎక్కడా ఏదీ కన్పించ లేదేమో! కిందికి దిగి వచ్చి, ఉక్రోషంగా చేతిలోనికి రాయిని తీసుకున్నాడు. టెలిగ్రాఫ్ స్తంభం మీది పింగాణీ గిన్నెను గురి చూసి కొట్టాడు. రాయి గిన్నెకి తగల్లేదు. తీగలకు తగిలింది. జలదరించాయవి. 'జుయ్యు'న శబ్దించాయి.

"పద పోదాం" అన్నాడు రత్నం. చేయి పట్టి నన్ను వెనక్కి లాగాడు.

మా అన్వేషణ అలా రెండేళ్ళపాటు కొనసాగింది. శవం దొరికి చావలేదు.

తొమ్మిదవ తరగతి పరీక్షలు రాశాను. అమ్మ చనిపోయింది. నాన్న లేనే లేడు. అమ్మ కూడా పోవడంతో వాళ్ళూరికి మామయ్య నన్ను తీసుకుపోయాడు. దాంతో రైలు గేటు, గేట్‌మన్ క్వార్టర్సు, రత్నంగాడు, వాళ్ళమ్మ, వాళ్ళక్క అంతా అందరూ కలగా మిగిలారు. యువ్వనంలోను, నిరుద్యోగంలోనూ నా బంగారు కల ఒక్కటే! నేనూ, రత్నంగాడూ కలసి శవాన్వేషణనే స్వప్నించేవాణ్ని!

ముప్పై ఏళ్ళ వాణ్ణయ్యాను.

పట్టాల మీద సూర్యకాంతి ముద్ద ముద్దలుగా మెరుస్తోంది. గేట్‌మన్ క్వార్టర్ లోనికి నడిచాను.

"రత్నం" అని కేకేశాను. ఎవరూ పలకలేదు. మళ్ళీ కేకేశాను. సమాధానంగా "ఎవరూ" అంటూ పూర్ణ ఎదురయింది. నన్నామె గుర్తించలేదు. నేనామెను గుర్తించాను. బాగా చిక్కి పోయుంది. బొగ్గులా తయారయింది.

"రత్నంగాడున్నాడా" అడిగాను.

"లేదు" అంది.

"మీరెవరు" అడిగింది.

"వాడి ఫ్రెండుని" అన్నాను. పేరు చెప్పి, గుర్తించమని ప్రాధేయ పూర్వకంగా చూశాను.

"ఇందాక పాసింజరు బండి వచ్చినప్పుడు పరుగెత్తుకు వెళ్ళాడు. ఇంకా రాలేదు. వస్తే, మీరొచ్చినట్టు చెబుతాను" అంది పూర్ణ. లోనికి వెళ్ళిపోయింది.

దుఃఖించాను. ముఖాన్ని చేత్తో రాసుకున్నాను. కళ్ళద్దాలు తగిలాయి. వాటిని ఎడమ చేత్తో తీసి, కనుకొలకల్ని కుడి చేతి చూపుడు, మధ్య వేళ్ళతో రుద్దాను. తడి తగిలింది. రత్నం వాళ్ళమ్మ కన్పిస్తుందేమోనని ఇంకా అక్కడే నిల్చున్నాను.

మళ్ళీ ఏదో రైలొస్తున్నట్టుంది. గేటు పడింది. అందునుంచి దూరి, ప్రయాణీకు లెవరో ప్లాట్ ఫారమ్మీదికి వేగంగా నడుస్తున్నారు. వాళ్ళలో ఒకడు నన్ను పరిశీలనగా చూసి —


"ఓర్నీయమ్మా! పగలు కూడా ఇది బిజినెసు ఎట్టేసినట్టుందంఢి" అన్నాడు. రెండోవాణ్ణి నవ్వించాడు.

రైలొస్తోంది. వస్తున్నానొస్తున్నానన్నట్టుగా కూత విడుతోంది. అయినా పూర్ణ పరుగెత్తుకుని రావట్లేదు.

సుడిగాలి చుట్టు ముట్టినట్టు చెల్లని, నన్నూ కుదిపేసి, రైలు ప్లాట్ ఫారమ్మీదికి వెళ్ళింది. ఇంజన్ను చూశానప్పుడు. డీసెల్ ఇంజనది. బొగ్గుతో దానికి ప్రమేయం లేదు. అంటే పూర్ణకి, ఈ రైళ్ళతో అనుబంధం తెగినట్టే. అందుకే రైలొస్తోన్న అలికిడిని ఆమె అంతగా పట్టించుకోలేదు అనుకున్నాను.

కొత్త నీరొచ్చి పాత నీటిని కొట్టుకు పోవడం సహజం. అయితే ఆ ప్రవాహంలో ఉనికిని, బతుకు తెరువుల్నీ కోల్పోయే జీవులు అనేకం వుంటాయి. వాటిలో పూర్ణ, నా బాల్యం కూడా వున్నాయి.

రత్నం వాళ్ళమ్మ ఎంతకీ కానరాకుండేసరికి వెను తిరిగి, ప్లాట్ ఫారమ్మీదికి నడిచాను. రైలు వెళ్ళి పోయింది. పాము మెలికలతో పయనిస్తుంతోంది. దరిదాపుల్లో




రత్నం గాడెక్కడా కన్పించలేదు. వాణ్ణి వెదుకుతూ పట్టాల మీద నడవసాగాను. అలవాటు తప్పిందేమో! నిలకడ కుదరట్లేదు. కాళ్ళు తడబడుతున్నాయి. కిందికి దిగి పరుగెత్త నారంభించాను. దొరికిన వస్తువుల్ని ఏరుకోసాగాను. రెండు సిగరెట్ పెట్టెలు దొరికాయి. ఓ అగ్గిపెట్టె దొరికింది. తెరచి చూడలేదు. రత్నంగాడు దొరికితే, వాడి సమక్షంలో వాటిని తెరచి చూద్దామని ఉంది. సిగ్నల్‌పోల్ దాటాను. దాటిన వాణ్ణి వెనక్కి వచ్చాను. పోల్‌నానుకుని వున్న నిచ్చెన నెక్కి దూరంగా చూపు సారించాను. పట్టాల నడుమ ఎవరో పడి వున్నారు. ఉత్సాహంగా కిందికి దిగాను. ఊపువందుకుని అక్కడికి చేరాను.

ఎవరో మృత దేహం! బోర్లపడి వుంది. కాలితో ముఖాన్నెత్తి చూశాను. బంగార్రాజు!

కాదు! రత్నంగాడు!

బంగార్రాజు, బంగార్రాజు లాంటి షావుకార్లకి ప్రమాదాలు జరగవు. వాళ్ళేనాడూ ఆత్మహత్యలు చేసుకోరు. భ్రమలు పోరు.

చేతిలోని సిగరెట్ పెట్టెల్ని, అగ్గి పెట్టెని తెరచి చూశాను. వాటిల్లో ఏమీ లేవు. అంతా శూన్యం! వాటిని మృత దేహం ముఖమ్మీద జార విడిచాను. అప్పుడు మళ్ళీ ఆ ముఖాన్ని పరిశీలనగా చూశాను. చనిపోయున్నది రత్నంగాడు కానే కాదు. నేను! నేనే చనిపోయున్నానక్కడ! నా ముఖమే రక్తసిక్తమై వున్నది! నన్ను నేను చూసుకుని, భోరు భోరున విలపించాను. పెద్దగా అరచి పరుగెత్తాను.

నా బాల్యం, రత్నంగాడు, పూర్ణ అందరం ఉమ్మి తడితో పట్టాల మీద పడి వున్న చిల్లర నాణేలం! రైలొచ్చే వేళ మాకు రూపాంతరం తప్పదు. అందుకు దుఃఖించి ప్రయోజనం లేదు. ●